అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత 7
కరుణించవా..వరుణ దేవా
● వానల్లేక అన్నదాత ఆందోళన
● నారు పోసే సమయం దాటి అయోమయం 8

పత్తాలేని సలహా కమిటీ

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు తప్పని తిప్పలు ● కరువైన పర్యవేక్షణ...పాలన అస్తవ్యస్తం



జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి అభివృద్ధి... రోగులకు ఇబ్బందులు లేకుండా చూడడం.. పారిశుధ్యం మెరుగుపరచడం.. నిధులు వ్యయం..ఉద్యోగులు, కార్మికుల పనుల పర్యవేక్షణ తదితరాలపై దృష్టి సారించడానికి ఏర్పాటు చేసిన ఆసుపత్రి స్థాయి సలహా కమిటీలు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఫలితంగా జిల్లాలోని పలు ఆసుపత్రులలో రోగులకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల జిల్లాలోని పలు ఆసుపత్రులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఆసుపత్రులలో పలు సమస్యలు తెరపైకి వచ్చాయి. సలహా కమిటీ సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహించి అభివృద్ధి, పాలనకు అవసరమైన నిర్ణయాలు తీసుకొని మార్పులు చేస్తే సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. సలహా కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో తత్సారం చేస్తుండడంతో సర్కారు ఆసుపత్రుల్లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి.

ఏర్పాటు లక్ష్యమిది..

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి ఆధారంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సభ్యులుగా గతంలో కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు ప్రతి మూడు నెలలకోసారి దవాఖానాల్లో వైద్యులు, సిబ్బందితో సమావేశా లు నిర్వహించాలి. రోగులకు ఇబ్బందులు లేకుండా చూడటం, ఆసుపత్రి అభివృద్ధి నిధుల వ్యయం, పారిశుధ్యం మెరుగు పరచడం, కార్మికులు, ఉ ద్యోగుల పనితీరు తదితరాలపై దృష్టి సారించాలి. ఈ సమావేశాలు నిర్వ హించకపోవడంతో నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదు.

మధ్యాహ్నం దాటితే.. ప్రైవేటుకు వెళ్లాల్సిందే..

జగిత్యాలలోని జిల్లా జనరల్ ఆసుపత్రి, అక్కడికి సమీపంలోని మాతా శిశుఆరోగ్య కేంద్రా నికి నిత్యం వందల సంఖ్యలో రోగులు, గర్భిణులు వస్తుంటారు. జిల్లా వాసులే కాకుండా సమీపంలోని సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాకు చెందినవారు జగిత్యాలలో వైద్య సేవలు పొందుతుంటారు. జగిత్యాలలో ప్రభుత్వ వైద్య కళాశాల కూడా నిర్వహిస్తున్నప్పటికీ ఏళ్లుగా సలహా కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదన్న విమర్శలున్నాయి. ఒక వేళ నిర్వహించినా కేవలం కాగితాలకు పరిమితం చేయడం, తూతూ మంత్రంగా సమావేశాలు నిర్వహించడం వల్ల లక్ష్యం నెరవేరడం లేదు. అత్యవసరంలో రోగులు హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా వార్డుల్లో ఇబ్బందులు తప్పడం లేదు. బయోమెట్రిక్ సేవలు అమలు కావడం లేదు. మధ్యాహ్నం దాటితే వైద్యులు, కిందిస్థాయి ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని, ప్రైవేటు దవా ఖానా లకు పరుగులు తీయాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆసుపత్రుల సలహా కమిటీ సమావేశాలను సక్రమంగా నిర్వహించి రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో ఆసుపత్రుల పరిస్థితి...

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 10.89 లక్షల జనాబా ఉంది. జిల్లాలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా జిల్లా ఏరియా ఆసుపత్రి, మా తా శిశు సంరక్షణ కేంద్రం, కోరుట్ల, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లిలలో వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నాయి. వీటితో పాటు ఆయా మండలాల్లో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 151 సబ్ సెం టర్లు, 24 గంటలు పనిచేసే ఆసుపత్రులు 7, పల్లె దవాఖానలు 102, బస్తీ దవాఖానలు 5 పనిచేస్తున్నాయి. వీటికి తోడు 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 10 ఆర్‌బీఎస్‌కే బృందాలు, 108 వాహనాలు 12, 102 వాహనాలు 6ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

వానాకాలం వ్యాధుల వ్యాప్తి...

వానాకాలం వస్తే చాలు, వివిధ రకాల జ్వరాలు, సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే ఆర్థిక భారం తప్పదు. అందుకే సర్కారు దవాఖానాలకు పరుగులు తీస్తుంటారు. అక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడం తో ఇబ్బంది పడుతున్నారు. నిర్వహణను మెరుగు పరిచేందుకు ఏర్పాటు చేసిన సలహా కమిటీలు సమావేశాలపై దృష్టి సారించక పోవడమూ వైద్య సేవలపై ప్రభావం చూపుతోందనే విమర్శలొస్తున్నాయి.

లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌గా గౌతమ్ రెడ్డి


కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా లోకల్ బాడీ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ రెడ్డి కలెక్టర్ సత్య ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. కొన్ని రోజులుగా సెలవులో ఉన్న జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి ఇటీవల బాధ్యతలు తీసుకోవడంతో ఆయనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో గౌతమ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

నరసింహుడి సన్నిధిలో పెద్దపల్లి ఎంపీ పూజలు


ఎంపీ వంశీకృష్ణ, విప్ అడ్లూరికి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

ధర్మపురి, జూలై 11: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ గురువారం ఉదయం సందర్శించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు అప్పం తిరుపతి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఒజ్జల లక్ష్మణ్, సుముఖ్, రాజేష్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర

జగిత్యాల టౌన్, జూలై 11 : జిల్లా కేంద్రంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో గురు వారం జగన్నాథ స్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, వైస్ చైర్మన్ గోళి శ్రీనివాస్ పాల్గొని రథయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, రథయాత్ర కమిటీ సభ్యులు ఉన్నారు.

గీత కార్మికుల సాధనకు నిరంతర కృషి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పరుశురాం గౌడ్

జగిత్యాల అర్బన్, జూలై 11: గీత కార్మికుల హక్కుల సాధనకోసం నిరంతరం కార్మికులతో కలిసి పోరాటం చేస్తానని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశురాం గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గురువారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించి, గత పాలక వర్గాన్ని రద్దుచేసి, నూతన పాలకవర్గాన్ని నియమించారు. అధ్యక్షులుగా చెట్ల చంద్రశేఖర్ గౌడ్, ప్రధానకార్యదర్శిగా నాయిని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా కట్ట నర్సాగౌడ్‌లను నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, సంఘ వ్యవస్థాపక సభ్యులు సంపునూరి మల్లేశంగౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ ఉన్నారు.

ఉద్యానవన శాఖ కమిషనర్‌ను కలిసిన ట్రెసా నేతలు

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉద్యానవన శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న యాస్మిన్ భాషాను గురువారం పలువురు ట్రెసా నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీలుతో పాటు పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఉద్యానవన శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక అభివృద్ధి చేందే విధంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళ సాధికారతపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలను అందించారు. వివిధ మండలాలు, మున్సి పల్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న మహిళ పథకాలలో అందిస్తున్న లబ్ది గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ సాధికారతపై నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చేందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శపాఠశాల పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అమ్మ ఆదర్శపనుల ప్రగతి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శపాఠశాల పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. ప్రతివారం పనులపై సమీక్ష జరుగునని సంబంధించిన ఇంజనీర్లు జియో ట్యాగింగ్ ఫోటోలతో హాజరుకావాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ వ్యక్తి మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్


ధర్మపురిలో మొక్కలు నాటుతున్న ఎంపీ, విప్, ఎమ్మెల్యే, కలెక్టర్

ధర్మపురి, జూలై 11: ప్రతి వ్యక్తి మొక్కలు నాటడం అనే బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి పట్టణంలోని బస్‌స్టేషన్ వద్ద పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలు రూపాయలు ఖర్చు చేసి వన మహోత్సవం చేపట్టడం జరిగిందని, ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 46 లక్షలు మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రజలు కోరుకున్న విధంగానే పూలు, పండ్ల మొక్కలనే పంపిణీ చేస్తామన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మా ట్లాడుతూ ప్రతి వ్యక్తి గ్రామ స్థాయి నుంచి పట్టణం వరకు మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు నీరు పోసి సంరక్షించాలన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ శక్తి, మహిళా శక్తి కార్యక్రమాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. జిల్లాకు మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి టార్గెట్ కూడ ఇచ్చామన్నారు. ధర్మపురి పట్టణంలో ఈ క్యాంటీన్ ఏర్పాటు చేయడం వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. చురుకైన మహిళా సంఘాల సభ్యుల ను నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుండి గైడ్ లైన్స్ రాగానే క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. చివరగా పట్టణంలోని మహిళా పొదుపు సంఘాలకు రూ 2,46,00,00 బ్యాంక్ లింకేజీ చెక్కును, రూ 14,23,643 వడ్డీ లేని రుణాల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఎంపీ, కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. అనంతరం ఇటీవల ప్రారంభమైన స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాలను సందర్శించారు. కళాశాల కార్యదర్శి సంగనభట్ల రామకిష్టయ్య వారందరిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మదుసూధన్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో దేవరాజు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, సంగనభట్ల సంతోషీ, జక్కు పద్మ, గరిగె అరుణ, సయ్యద్ యూనస్, తరాల్ల కార్తీక్, మండల ప్రత్యేక అధికారి రాంచందర్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రవీందర్, ఈజీఎస్ ఏపీవో సృజన్, ఐకేపీ ఏపీఎం రమాదేవి, మెప్మా ఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యావర్ రోడ్డు విస్తరణ చేపడుతాం



చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు

జగిత్యాల టౌన్, జూలై 11 : జిల్లా కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ట్రాఫిక్ సమస్యగా ఉన్న యావర్ రోడ్డును త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వంలో విస్తరణ చేపడుతామని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం చైర్ పర్సన్ తన నివాసంలో కౌ న్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్డు విస్తరణలో గృహ, వాణిజ్య సముదాయాల వారు తమ స్థలాలు కోల్పోతున్నప్పటికీ పరస్పర అంగీకారంతో పరిహారం చెల్లింపులతో రోడ్ల విస్తరణ చేపడుతామన్నారు. నూకపల్లి హౌజింగ్ కాలనీలోని డబుల్ బె డ్ రూం ఇళ్ల మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇదివరకే సీఎంను కలిసి వివరించారని అతి త్వరలోనే మౌలిక వసతులు కల్పించి నిరు పేదలకు అండగా ఉంటామన్నారు. గత ప్రభుత్వం యావర్ రోడ్డు విస్తరణకు కావలిసిన నిధులు సమకూర్చడంలో మాటలకే పరిమితమయిందన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి యావర్ రోడ్డు విస్తరణకు రూ 100 కోట్లు కేటాయించేలా నిర్ణయం తీసుకోవడం పట్ల వారికి ప్రత్యేక కృత జ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య, కౌన్సిలర్లు నక్క జీవన్, వల్లెపు రేణుక, లావణ్య, అల్లె గంగాసాగర్, సుల్తానా, నాయకులు గాజుల రాజేందర్, కమాల్ ఉన్నారు.

●అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఎల్ఆర్ గార్డెన్‌లో జగిత్యాల పట్టణంలోని అర్హులైన లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను చైర్ పర్సన్ అందజేసి మాట్లాడారు. వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, వివిధ వార్డుల కౌన్సిలర్లు ఉన్నారు.

జనాభా నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత

జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

జగిత్యాల టౌన్, జూలై 11 :జనాభా పెరుగుదలే పేదరికానికి ప్రధాన కారణమని, నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి సమియోద్దిన్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాలులో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం జనాభా నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణను ప్రవేశ పెట్టిందని ఆడ, మగ తేడా లేకుండా నియంత్రణను పాటించాలని కోరారు. ప్రపంచ జనాభా 800 పైగా కోట్లకు చేరువలో ఉందని ఇందులో భారతదేశ జనాభా 142 పైగా కోట్లకు చేరుకుని అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో మనదేశం మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లా కేంద్రంలోని మాత, శిశు ఆరోగ్య కేంద్రంలో వారంలో మూడు రోజులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం వైద్య రంగంలో ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు, సిబ్బందికి జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న ఆదర్శ దంపతులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు తిరుపతి, తులసీ రమణ, భూమేశ్వర్, రాంకుమార్, సత్యనారాయణ, శ్యాంసుందర్, మురళి, శ్రీనివాస్, హరీష్, శరత్, అజహార్ ఉన్నారు.

గుడుంబా తయారు చేసిన, విక్రయించినా చర్యలు

- మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి, ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడులు హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అల్లూరిసీతారామాతండా, ఆత్మనగర్ తండాలో తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న సంతోష్‌నాయక్, గంగాధర్‌నాయక్‌లను పట్టుకొని వారి నుంచి 10లీటర్ల గుడుంబా పారబోశారు. 500 లీటర్ల పానకం, ముడి సరుకులను ధ్వంసం చేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఇకపై గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారీ చేసిన, తయారీకి ముడి సరకు సరఫరా చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా నాటుసారా తయారీకి కావాల్సిన వస్తువులు కొనుగోళ్లపై దృష్టి సారిస్తామన్నారు. దాడుల్లో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఏఎస్‌ఆర్‌తండాలో గుడుంబాను పట్టుకున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

కోరపల్లి రోడ్డులో తనిఖీలు


జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కోరపల్లి రోడ్డులో గల పలు ఇళ్లలో అబ్కారీ ఎస్ఐ సౌమ్య ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. గుడుంబా విక్రయాలు ఏమైనా జరుపుతున్నారా అనే కోణంలో కుండలు, బకెట్లు, పాత్రలు, డ్రమ్ములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గుడుంబ విక్రయాలు జరుగడం లేదని, ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీలు జరిపినట్లు తెలిపారు. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట అబ్కారీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాచ్‌మన్ నుంచి లెక్చరర్ స్థాయికి...

బెల్లంపల్లి, జూలై 11: వాచ్‌మన్‌గా పనిచేసి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కొమురయ్య-పుష్పలత దంపతుల కుమారుడు రాజ్‌కుమార్. రాజ్‌కుమార్ తండ్రి పంచాయతీరాజ్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. తండ్రి మరణం తర్వాత కుటుంబానికి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. రాజ్‌కుమార్ డిప్లొమాతోనే చదువు మానేసి పది సంవత్సరాల పాటు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహించాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు చదువుకోవాలని సూచించడంతో మళ్లీ చదువుబాట పట్టాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీతోపాటు పీజీ పూర్తి చేశాడు. టెట్ రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాడు. 2017లో నిర్వహిం చిన ప్రభుత్వ గురుకుల పరీక్షలో టీజీటీ, పీజీటీ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో తెలుగు సబ్జెక్టులో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు, మల్టీజోన్ 1లో మూడో ర్యాంకు సాధించాడు. దీంతో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. స్నేహితులు, కుటుంబీకులు, ఉపాధ్యాయులు అభినందించారు.




విజయ సంకేతం చూపుతున్న రాజ్‌కుమార్















ప్రభుత్వ పాఠశాలల్లో ఆరుబయటే పాఠాలు

- సరిపడా తరగతి గదులు లేక విద్యార్థుల ఇక్కట్లు

- వానాకాలంలో మరింత ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన బోధన అందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ఉపాధ్యాయులు, తరగతి గదులున్న చోట విద్యార్థులు లేకపోవడం, టీచర్లు ఉన్న పాఠశాలలకు పిల్లలు రాకపోవడంతో పాఠశాలల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గదుల కొరతతో ఆరుబయట ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై గదుల కొరత ప్రభావం తీవ్రంగా పడుతోంది. నిబంధనల ప్రకారం తరగతికి ఒక గది ఉండాలి. చాలా చోట్ల తరగతులకు సరిపడా గదులు లేవు. ముఖ్యంగా వానాకాలం ఈ సమస్య మరింతగా వేధిస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో ఒకే తరగతి గదుల్లో విద్యార్థులను ఇరుకుగా కూర్చోబెడుతున్నారు. భౌతిక దూరం పాటించాలనే నిబంధన అమలు కావడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బడి బాట కార్యక్రమాన్ని చేపట్టి చిన్నారులు, యువతను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాఠశాలలోని సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను మోడల్‌గా తయారు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో మన ఊరు మన బడి కింద పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టి నిధులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలోని ఎంపిక చేసి విద్యుదీకరణ,



రాజేశ్వర్‌రావుపేటలో ఆరుబయట పాఠాలు వింటున్న విద్యార్థులు

తాగునీరు, మూత్రశాలల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ప్రహరీ, కిచెన్ షెడ్స్ నిర్మాణాలను చేపట్టారు. చేసిన పనులకు గత ప్రభుత్వం మొదట్లో నిధులు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలలకు ముందు నుంచి తరగతి గదుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

● విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు...

గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు చేర్చుకున్నారు. కానీ పాఠశాలలో తరగతి గదల కొరతతో విద్యా బోధన ఆరుబయట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలంలో విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, బండలింగాపూర్, రామలచ్చక్కపేట, కోనరావుపేట, జగ్గసాగర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడం వలన విద్యార్థులకు ఆరుబయట ఉపాధ్యాయులు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా తగినంత గదులు లేకపోవడంతో బోధన ఇబ్బందిగా కొనసాగుతోంది. పేద విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యనందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నది. ముఖ్యంగా పాఠశాలలో సరైన తరగతి గదులు, సరైన వసతులు అందుబాటులో లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల కొరత విషయాన్ని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీ సుకెళ్లినట్లు గ్రామాల్లోని మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు కోరుతున్నారు.

● ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

- భీమయ్య, ఇన్‌చార్జి ఎంఈవో, మెట్‌పల్లి

మండంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కొన్ని గ్రామాల్లోని పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేశాము. మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు నిధులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో గదుల కొరత, పలు సమస్యలు అలాగే ఉన్నాయి. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలలోని సమస్యలను పరిష్కారం అవుతున్నాయి.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 11: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రవంకెన్ డ్రైవ్ కేసులో 23 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష లేదా మొత్తం ఏడు వేల జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు. మిగతా 20 మంది వాహనదారులకు 35,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

ఇద్దరు యువకుల ఆరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 11 : సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డు, జూనియర్ కళాశాల వద్ద ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న ఇద్దరు యువకులను ఆరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి సుందరయ్యనగర్‌కు చెందిన బూరాని గణేష్‌సింగ్, భోగ రాజు అనే ఇద్దరు యువకులను పట్టుకొని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారని అన్నారు. యువకులపై నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'గృహజ్యోతి' ఎడిట్ ఆప్షన్

గణేశ్‌నగర్, జూలై 11: గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి వివరాల నమోదులో తప్పులు దొర్లిన వారికి శుక్ర వారం నుంచి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్లను ఇచ్చింది. నెలకు 200 యూనిట్లు వాడుతూ తెల్లరేషన్ కార్డు గల వారికి ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గతంలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని విద్యుత్ యూఎస్‌సి/ఎస్‌సి నంబర్ తప్పుగాపడి జీరోబిల్ రాని వారు ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో సరిచేసుకోవచ్చు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత

- 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం

- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ

జగిత్యాల టౌన్, జూలై 11: జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి రాకెట్ ముఠాను పట్టుకున్నారు. వీరి వద్ద 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు, రూ. 3,500 నగదును సీజ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో దొంగల ముఠాను అరెస్టు చూపించి విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి విక్రయిస్తూ రాయపట్నం గ్రామానికి చెందిన బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుపడగా దొంతాపూర్ గ్రామానికి చెందిన దుర్గం రాము తప్పించుకుని పారిపోయాడు. బుధవారం ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి గ్రామంలో పోలీసుల కల్లుగప్పి తప్పించుక తిరుగుతున్న రాము ఉన్నాడనే సమాచారం అందింది. దీంతో ధర్మపురి ఎస్ఐ ఉదయ్ కుమార్ తన సిబ్బందితో బుద్దేష్‌పల్లికి వెళ్లి గాలించగా రాముతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద 6.300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రాముతో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఒడిషా రాష్ట్రంలోని రాయగడ ప్రాంతానికి చెందిన దినేష్ కుమార్ నాయక్, మరొకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరానికి చెందిన గుజ్జల పురుషోత్తంగా గుర్తించారు. మరో ఇద్దరు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్ గంజాయిని పండిస్తూ విజయనగరానికి చెందిన పురుషోత్తంకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌కు చెందిన దుర్గం రాము ఇదే మండంలోని మగ్గిడి గ్రామానికి చెందిన అజయ్, సంజయ్‌కు ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్, విజయనగరానికి చెందిన పురుషోత్తంతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరంతా ఒక ముఠాగా ఏర్పడ్డారు. చందు, వెంకటేష్, రాము, అజయ్, సంజయ్ కలిసి ఒడిషా వెళ్లి అక్కడ రాయగడ రైల్వేస్టేషన్‌లో దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తంలను కలుసుకుని గంజాయిని కొనుగోలు చేస్తూ ధర్మపురి ప్రాంతంలో విక్రయిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలనే ప్లాన్ చేశారు. ధర్మపురి పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

చాకచక్యంగా వ్యవహరించి ధర్మపురి ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పాటు ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుకుని వారి గుట్టురట్టు చేశారు. ఒడిషాకు చెందిన దినేష్ కుమార్ నాయక్‌కు గతంలో ఏపీ రాష్ట్రంలో జరిగిన ఎన్‌డీపీఎస్ చట్టంలో ప్రమేయం ఉండడంతో పాటు ఒడిషాలోని షేల్‌ఖాల్ పోలీస్ స్టేషన్‌లో పొక్సో కేసు నమోదై రాయగడ జైలులో శిక్షను కూడా అనుభవించాడు.

ఏపీకి చెందిన పురుషోత్తం సైతం ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులో రాయగడ జైలుకు వెళ్లగా వీరిద్దరికి అక్కడ పరిచయం ఏర్పడినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో గతంలో బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుబడగా, తాజాగా రాము, దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తం పట్టుబడగా అజయ్, సంజయ్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో అక్రమ గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాను గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నామన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్న డీఎస్పీ రఘచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి, గొల్లపల్లి ఎస్ఐలు ఉదయ్‌కుమార్, సతీష్, పోలీస్ సిబ్బంది రమేష్ నాయక్, పూర్ణ సాయి, రమేష్, రామస్వామి, అశోక్, సలీమోద్దీన్, వెంకటయ్య, నవీన్‌ను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై ఆందోళన

- చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల డిమాండ్

కరీంనగర్ రూరల్, జూలై 11: స్త్రీనిధి సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలని గురువారం చామనపల్లి గ్రామైఖ్య సంఘాల మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. లక్షలు గోల్‌మాల్ జరుగుతుండగా, క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి గ్రామంలో 10కి పైగా మహిళా సంఘాలున్నాయని తెలిపారు. కరోనాకాలంలో సదరు సంఘాలకు స్త్రీ నిధి రుణాలు 35లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వాటిని మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా ఓ కోఆర్డినేటర్ కరోనా సమయంలో రుణం సమాచారం తెలుపకుండా మహిళల ఐడి కార్డులు, బ్యాంకు ఖాతాలను సేకరించి, గుట్టుగా సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. రెండేళ్ల క్రితం అక్రమ బాగోతం వెలుగు చూడగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ డబ్బు వడ్డీతో కలిపి మొత్తం 40లక్షలకు చేరింది. మహిళలకు రుణాలు ఇవ్వకపోగా రేపు మాపంటూ తిప్పుకున్నారని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని మహిళలు ఆరోపించారు. గతంలో కరీంనగర్ రూరల్ పోలీసులకు డీఆర్‌డీఏ అధికారులకు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. న్యాయం కోసం ప్రతి రోజు



ధర్నా చేస్తున్న చేగుర్తి మహిళ సంఘాల సభ్యులు

పోలీస్‌స్టేషన్లు, అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని మహిళలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని శ్రీనిధి డబ్బులు, పొదుపు సంఘాల డబ్బులు ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీవో అధ్యక్షులు, గ్రామైఖ్య సంఘం మహిళలు గాలిపెల్లి కనుకలక్ష్మీ, నర్సమ్మ, రాజమ్మ, సరోజన, కనుకలక్ష్మి, సరోజన, ఈశ్వరమ్మ, అయిలమ్మ, విజయ, రమ, శారద, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.243 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.573 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 124 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550 రూపాయలు, కనిష్ఠ ధర 7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

సిరిసిల్ల రూరల్, జూలై 11: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలోని గొర్రెల మందపై గురువారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయడంతో దాదాపు 20 గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన సిద్ది కనకయ్య యాదవ్ అనే గొర్రెల కాపరి తనకు ఉన్నా 40 గొర్రెలను గ్రామ శివారులోని తన ఇంటి వద్దనే ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచాడు. గురువారం తెల్లవారుజామున కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి 20 గొర్రెలను చంపి వేయగా మరో 20 గొర్రెలను గాయపర్చాయి. గురువారం ఉదయం మంద వద్దకు వెళ్లిన కనకయ్య చనిపోయిన గొర్రెలను చూసి దు:ఖ సాగరంలో మునిగిపోయాడు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలతో రెండు లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు గ్రామంలోని కుక్కలను తరలించాలని గ్రామస్థులు కోరారు.

దొంగ సొత్తు కొంటే కఠిన చర్యలు

- 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్

- 27మంది బైండోవర్

సిరిసిల్ల క్రైం, జూలై 11: దొంగ సొత్తుకొంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని స్క్రాప్ దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించిన సందర్భంగా గురువారం ఎస్పీ వివరాలు వెల్లడించారు. స్క్రాప్ వ్యాపారం మాటున అక్రమ దందా కొనసాగించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. దీంతో 27మంది వర్తకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. షాపులో కొనుగోలు, అమ్మకాల్లో ప్రతి వస్తువుకు రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. తుక్కు, స్క్రాప్‌నకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేయకూడదని ఎస్పీ తెలిపారు.

ముంబాయి పోలీసుల అదుపులో ఇద్దరు కరీంనగర్ వాసులు

-సైబర్‌క్రైం కేసులో అదుపులోకి

కరీంనగర్ క్రైం, జూలై 11: సైబర్ క్రైం కేసులో ప్రమేయం ఉందన్న కారణంగా ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ పోలీసులు గురువారం కరీంనగర్‌లో పలు చోట్ల సోదాలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ మరో నలుగురు పోలీసు సిబ్బందితో కూడిన బృందం గురువారం మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుని సుభాష్‌నగర్‌కు చెందిన ఫరూక్ అహ్మద్, ఆదర్శనగర్‌కు చెందిన వీరనాథ్‌ను అదుపులోకి కరీంనగర్ మూడో ఠాణాకు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. మరో నిందితుడు అసీముద్దీన్‌తోపాటు మరో మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతని కోసం ముంబాయి, స్థానిక పోలీసు టీం గాలిస్తున్నది. మార్చి నెలలో ముంబాయిలో బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ ఫూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ ఖాతా తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబాయి సైబర్ పోలీసులు గుర్తించి, నిందితులను విచారించేందుకు ఇక్కడికి వచ్చినట్లు సమాచారం. అంతర్జాతీ సైబర్ నేరగాళ్లతో కరీంనగర్‌వాసులకు ఉన్న సంబంధం, బ్యాంక్ లావాదేవీలపై విచారణ జరుపుతున్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురిచేస్తే చర్యలు

వేములవాడ కల్చరల్, జూలై 11 : వృద్ధాప్యంలో భరోసాగా ఉండాల్సిన సంతానం తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ డిజెబుల్ వెల్ఫేర్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్ అండ్ ట్రాన్స్‌జండర్ పర్సన్స్ శైలజ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, పీఆర్వో సిరిగిరి శ్రీరాములు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొనగా ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించి ఆలయాధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌస్‌లో శైలజ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 14567 కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సంబంధిత అధికారులను నేరుగా ఇంటికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అన్యాయం వయో వృద్ధుల ఆస్తిని వారసులు అనుభవిస్తూ వారిని నిర్లక్ష్యం చేసినట్లయితే అట్టి ఆస్తిని



స్వామి వారి శేషవస్త్రాలను అందజేస్తున్న ఆలయాధికారులు

తిరిగి స్వాధీనం పరుచుకుని తిరిగి వయోవృద్ధులకు అందిస్తామని వివరించారు. జిల్లాలో వయోవృద్ధులు టోల్ ఫ్రీ నంబర్‌ను వినియెగించుకోవాలని 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, ఫీల్డ్ రెస్పెన్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు ఉన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



తిరుమల శ్రీవారి ఆలయంలో బండి సంజయ్‌కుమార్, కుటుంబసభ్యులు

భగత్‌నగర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం, తన పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు.

తిరుపతిలో టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు బండి సంజయ్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం అందజేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న నెమళ్లు

- ఇళ్ల మధ్య నెమలి మృతదేహం లభ్యం

గన్నేరువరం, జులై 11: మండలంలోని మైలారం గ్రామంలో జాతీయ పక్షులైన నెమళ్లకు రక్షణ కరువైంది. మానేరు డ్యాం శివారులో ఉన్న మైలారం గ్రామం గుట్టల ప్రాంతం కావడంతో అక్కడ నెమళ్లు, అడవిపందులు, కుందేళ్ళు, ఎలుగుబంట్లు ఉండడంతో వాటిని వేటగాళ్ళు వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గ్రామంలో వెల్లువెత్తున్నాయి. గురువారం గ్రామంలోని జనావాసాల సమీపంలో నెమలి మృతదేహం, ఈకలు కనిపించాయి. వేటగాళ్ళు నెమలిని వేటాడి చంపి మాంసంగా మార్చే ప్రయత్నంలో ఏమరపాటు మూలంగా వీధి కుక్కలు నెమలి మృతదేహాన్ని లాక్కెళ్ళి తిన్నదని విశ్వసనీయ సమాచారం. గత కొంతకాలంగా ఈ నెమల్ల వేట యధేచ్ఛగా కొనసాగుతుందని, వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వన్యప్రాణుల వేటపై దృష్టి సారించక పోవడం మూలంగా ఏకంగా జాతీయ పక్షి నెమల్లను సైతం వేటగాళ్ళు వదలటం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నెమలుల వేటపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

● ఫారెస్ట్ అధికారుల పరిశీలన..

మైలారంలో నెమళ్ల వేట విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ సాయంత్రం మైలారం గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెమలి మృతదేహం వద్ద పరిశీలించగా వారికి నెమలి ఈకలు లభించగా నెమలి కళేబరం కనబడలేదు. రాత్రి కావడంతో నెమలి మృతదేహాన్ని వెతకడం సాధ్యం కాలేదని తెలిపారు. శుక్రవారం తిరిగి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కనుగొని పంచనామా నిర్వహించి, గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

చెరువు తూములు తెరిపించాలని ఆందోళన

మల్యాల, జూలై 11: మల్యాలలోని సూరప్ప చెరువు తూములను మూసివేయడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తూములు తెరిపించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సూరప్ప చెరువులో తమకు పట్టా భూములు ఉన్నాయని వానాకాలంలో ఆ భూములు నీటిలో మునిగిపోతుండగా కొన్నేళ్లుగా యాసంగి పంట మాత్రమే చేసుకుంటున్నామని అయితే మూడేళ్లుగా చెరువు తూములు తెరవకపోవడంతో నీరు అందులోనే ఉండి పంటలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తూములు మూసి ఉండడంతో చెరువులో గల భూములు సాగు కాకపోగ, తూములు తెరువక నీళ్ల రాక చెరువు కింది భూములలో పంటలు సాగు చేయక నష్టపోవాల్సి వస్తుందని తహసీల్దార్‌తో పేర్కొన్నారు. తూములు తెరిపించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు కూడా కలిసి తమ ఆవేదన తెలిపారు. కార్యక్రమంలో రైతులు బావు శంకర్, తాటిపాముల జగదీశ్వర్, జక్కుల రాయమల్లు, సంగ సత్యనారాయణ, బావు నాగభూషనం, గడ్డి లచ్చన్న, సంతోష్ తదితరులు అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

సాంకేతికలోపంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్ క్రైం, జూలై 11: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌డౌన్‌తో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. క్రయవిక్రయదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేచి చూసి విసిగిపోయి వెళ్లిపోయారు. గురువారం రోజు వివిధ రకాల రిజిస్ట్రేషన్ల కోసం దాదాపు 50 వరకు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని కార్యాలయానికి వచ్చిన విక్రయదారులు కార్యాలయంలో సాంకేతికలోపం తలెత్తిందని అధికారులు చెప్పటంతో రోజంతా కార్యాలయం లోపల, బయట వేచి ఉన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌లింకప్ కాకుండా మొరాయించటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయయని అధికారులు తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూశారు. సాంకేతిక సమస్య పరిష్కారం అయితే ఏ సమయంలో అయినా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గురువారం రోజు స్లాట్‌ను శుక్రవారానికి అనుమతి ఇస్తామని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే సమస్యతో రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

తెలంగాణ సంప్రదాయాలు దేశానికే ఆదర్శం

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



గవర్నర్‌తో తాడిజెర్రి ఒగ్గుకళాకారుల బృందం

గంగాధర. జూలై 11: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు దేశానికే ఆదర్శమని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. డిల్లీలో ఈనెల 9,10 తేదీల్లో లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవస్థానం, తెలంగాణ భాష సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో బోనాల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన ఈర్ల మహిపాల్ ఒగ్గు కళాకారుల బృందం గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి తెలంగాణ భవన్ వరకు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఒగ్గు డోలు బృందాన్ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడినట్లు ఈర్ల మహిపాల్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. తెలంగాణ కవులు, కళాకారుల ఆటపాటలు ప్రజలను ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కళాకారులు, కవులు, సాహితీవేత్తలు తమ కళలతో తెలంగాణ ఘనతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాబృందానికి మెమెంటోను అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు మహేందర్, గణేష్, రాము, గంగాశంకర్, అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానేరు డ్యాంలో నీటమునిగి గొర్రెలు మృతి

● కుక్కలనుంచి తప్పించుకునేందుకు నీటిలోకి దూకిన మూగజీవాలు

గన్నేరువరం, జులై 11: మానేరు డ్యాంలో నీట మునిగి పలు గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మర్రి తిరుపతి, పేరం ముత్తయ్య, మడికంటి అశోక్‌కు చెందిన గొర్రెలను మేత కోసం గ్రామశివారులోని మానేరు డ్యాం పరిసర ప్రాంతంలో మేపడానికి గొర్లను తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో కాపరులు భోజనం చేస్తుండగా గుంపుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేశాయి. దీంతో కుక్కల భయానికి గొర్రెలు అన్నీ నీటిలోకి దూకగా సుమారు 30 గొర్లు నీటిలో గల్లంతు కాగా 70 గొర్లను అక్కడే ఉన్న మత్స్యకారులు రక్షించారు. నీటిలో మునిగిన గొర్లలో మృతి చెందిన ఆరు గొర్రెల మృతదేహాలు లభ్యం కాగా మిగతా వాటి జాడ తెలియలేదు. తమకు జీవనాధారమైన మూగజీవాలను కోల్పోయామని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధిత గొర్రెల కాపరులు వేడుకుంటున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

మల్యాల, జూలై 11: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశత్తూ జారి పడడంతో గీతకార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని మల్యాలకు చెందిన కాసారం ఆంజనేయులుగౌడ్ గురువారం కల్లు కోసం తాటి చెట్టు ఎక్కి కిందకు వస్తుండగా ప్రమాదవశత్తూ జారి కింద పడ్డాడు. దీంతో ఆంజనేయులుకు ఛాతిలో, నడుముకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

సీపీఐ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

కోరుట్ల, జూలై 11 : కరీంనగర్ ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26వ తేదీలలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను విజయ వంతం చేయాలని సీపీఐ నాయకులు గురువారం కోరారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, జిల్లా సహాయ కా ర్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కార్మిక సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలు అందించే విధంగా చొరవ చూపేందుకు సబ్ కలెక్టర్ కార్యాలయ ముట్టడి ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద దర్నా నిర్వహించి వినతి పత్రం అందించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎన్నం రాధ, రాంబాబు, మనోహర్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టు భవనం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోరుట్ల, జూలై 11 : సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది రవికుమార్‌పై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం కోరుట్ల బారు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనను నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు భవనం నిరసన తెలిపి ఆందోళన తెలిపారు. న్యాయవాదులపై పోలీసుల దాడులను ఖండిస్తున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తస్నీర్ శ్రీనివాస్, సభ్యులు సుతారి శ్రీనివాస్ రెడ్డి, చిలివేరి రాజశేఖర్, తోట అంజనేయులు, మద్దుల రోజ, రాచకొండ రోజ, సదానంద నేత, కొంపల్లి సురేష్, చాప కిశోర్, మచ్చ రమణ మూర్తి పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే దాడులు చేయడమా...?

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యం అంటే జర్నలిస్ట్‌పై దాడి చేయడమా అని జిల్లా పరిషత్ మాజీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో ఆమే మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్టులకు రక్షణ కరువైందన్నారు. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్ట్ కవరేజీకి వెళితే దాడులు చేయడం దురదృష్టకరమన్నారు. గతంలో ఓ టీవీ చానల్ రిపోర్టర్ శంకర్‌పై దాడులు చేశారని, ఇటీవల బాల్కంపేట ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో ఓ టీవీ చానల్ మహిళా జర్నలిస్ట్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని గుర్తు చేశారు. తాజాగా హైద్రాబాద్‌లో నిరుద్యోగ నిరసన ర్యాలీ కవరేజీకి వెళ్లిన ఓ జర్నలిస్టుపై పోలీసులు దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు.

మెట్‌పల్లి: న్యూస్ సేకరించడానికి వచ్చిన జర్నలిస్టులపై చేస్తున్న దాడులు అరికట్టాలని మెట్‌పల్లి వర్కింగ్ ప్రెస్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిరుద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని కవర్ చేయడానికి వెళ్లిన జీ న్యూస్ రిపోర్టర్ శ్రీచరణ్‌పై పోలీసులు చేసిన దాడిని నిరసిస్తూ గురువారం పట్టణంలోని ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. వర్కింగ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సౌడాల కమలాకర్, కోరుకంటి విజయ్, షౌకత్‌అలీ, బెజ్జారపు నవీన్, నాంపల్లి నమ్మాద్రి, ముదాం శ్రీనివాస్, అల్లె సంతోష్, దురిశెట్టి హరీష్, సభ్యులు పాల్గొన్నారు.

వేంపేట మాజీ ఎంపీటీసీకి సన్మానం

మెట్‌పల్లి రూరల్, జూలై, 11 : మండలంలోని వేంపేట గ్రామ మాజీ ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్‌ను గీత పారిశ్రామిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామ ఎంపీటీసీగా ఐదు ఏళ్ల పదవి కాలం పూర్తి కావడంతో గీతా పారిశ్రామిక సంఘం నాయకులు గురువారం శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు చిలివేరి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మారంపల్లి గణేష్, గౌడ సంఘం అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బ్రూక్లీన్ హైస్కూల్లో బోనాల పండుగ



మెట్‌పల్లిలో వివిధ వేషధారణలో బ్రూక్లీన్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు

మెట్‌పల్లి, జూలై, 11 : మెట్‌పల్లి పట్టణంలోని బ్రూక్లీన్ గ్రామర్ హైస్కూల్‌తో పాటు పలు పాఠశాలలో ముందస్తు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాల ఆవరణంలో కరస్పాండెంట్ ప్రసాద్‌గౌడ్, జయలక్ష్మి మైసమ్మతల్లిని ప్రతిష్ఠించిటీ విద్యార్థులు అమ్మవారి, పోతురాజులు, బతుకమ్మ వేషధారణలో పాటాలు పాడి, నృత్యాలు చేశారు. అనంతరం బోనాల పండుగ విష్టతను వారు విద్యార్థులకు తెలియజేయశారు. విద్యార్థులు తయారు చేసిన బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకునే ఆనవాహితి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించాలి'

మెట్‌పల్లి, జూలై, 11 : కష్టాలు వచ్చినా ఎదురుండి సుదీర్ఘ కాలం నుంచి పార్టీ జెండా మోస్తున్న నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలని పార్టీ సీనియర్ నాయకుడు రేండ్ల రమేష్ కోరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు పార్టీ కార్యాయలంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ సిద్ధాలతో అంకితభావంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నిరంతరం కష్టపడి పనిచేసిన నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కటకం గంగారెడ్డి, పొట్ట రాజేశ్వర్, బత్తుల దీక్షిత్, గోనె ప్రసాద్, సంగు గంగాధర్, ఎండీ రైసుద్దీన్, ఖలీద్, పల్లికొండ ప్రవీణ్, పొట్ట గోపి, తదితరులు పాల్గొన్నారు

బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ సోదాలు

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త బస్టాండు సమీపంలో గల స్వాగత్ బార్ అండ్ రెస్టారెంట్‌లో గురువారం ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష విస్తృతంగా సోదాలు జరిపారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో కలుషిత ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూషతో పాటు సిబ్బంది ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన పలు వెజ్, నాన్ వెజ్ ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యతలో అనుమానం ఉన్న పలు ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు. ఫుడ్ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫుడ్ కోర్టులు, ఫుడ్ పాయింట్, ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాలలో సోదాలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈత వనాల పెంపకంతో గౌడ కులస్థులకు జీవనోపాధి పెంపు

రాయికల్, జూలై 11: ఈత వనాల పెంపకంతో గ్రామంలోని గౌడ కులస్థుల జీవనోపాధి మెరుగుపడుతుందని జగిత్యాల ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ అన్నారు. మండలంలోని ఇటిక్యాల గౌడ కులస్థులతో కలిసి 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా చింత చెరువు కట్టమీద ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్తులు పరస్పర సహకారంతో నా టిన ఈత మొక్కలను సంరక్షించాలని కోరారు. గీత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఎక్సైజ్ శాఖ ఈత వనాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై స్వప్న, సిబ్బంది, గౌడ సంఘం అధ్యక్షుడు జవ్వాజి నర్సా గౌడ్, ఉపాధ్యక్షులు అనుపురం సత్తయ్య గౌడ్, నాయిని ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

కరుణించవా..వరుణ దేవా

- వానల్లేక అన్నదాత ఆందోళన
- నారు పోసే సమయం దాటి అయోమయం
- వెలవెలబోతున్న వరద కాలువ
- ముదిరిపోతున్న జీలుగ



వెలవెలబోతున్న వరద కాలువ

కథలాపూర్, జూలై 11 : వానాకాలం ఆరంభమై నెల దాటిపోతున్నా ఆశించిన వర్షాలు కురవకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. జూన్, జూలై మాసాల్లో కురవాల్సిన సాధారణ వర్షపాతం కూడా నమోదు కాని కారణంగా రైతన్నకు దిక్కుతోచని పరిస్థితి దాపురించింది. వానల కోసం రైతులు ఆకాశం వంక చూస్తున్నా చినుకు రాలక కలవర పడుతున్నారు. వరుణ దేవా..కరుణించవా అంటూ ఆశగా చూడాల్సి వస్తోంది.

● ముదిరిన నారు, జీలుగ, జనుము

వానకాలే కదా వర్షాలు కురవకపోతాయా అనే ఆశతో బోర్ల నుంచి కొద్దిపాటి నీళ్లు వచ్చే రైతులు జూన్ రెండో వారంలోనే నార్లు పోసుకున్నారు. ప్రస్తుతం ఆ నార్లు నెల దాటిపోవడం వల్ల ముదిరిపోతున్నాయి. పొలాల్లో నత్రజని, భాస్వరం పెంపు కోసం రైతులు జీలుగ, జనుము వంటి విత్తనాలు చల్లుకోగా ముదిరి పూత దశకు వచ్చే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి నెల రోజుల్లోపే జనుము, జీలుగను దున్నుకోవాల్సి ఉంటుంది. జూన్ మాసంలో 196 సెంటిమీటర్ల వర్షపాతం కురవగా కేవలం 19 శాతం, జూలై 8 నాటికి 112 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు అయింది. లోటు వర్షపాతం వల్ల బోర్లు, బావుల్లోకి నీరు రాకపోవడంతో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

● వరద కాలువ రైతుల అయోమయం

వరద కాలువను నమ్ముకుని సాగు చేసే రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. వానలు లేని కారణంగా నేటికీ నారు పోసుకోలేదు. వాస్తవానికి జూలై 10 నాటికి నాట్లు వేసుకోవాల్సి ఉండగా నారే పోయలేని పరిస్థితి ఏర్పడడంతో ఆందోళన చెందుతున్నారు. వందలాది ఎకరాలు వరద కాలువపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేసుకుంటారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటల సాగు ఎలా అనేది రైతన్న సందేహిస్తున్నారు. మరో పది రోజుల్లో వానలు కురవకపోతే ఖరీఫ్ సీజన్ సాగు కష్టమేనని పేర్కొంటున్నారు.

ముదురుతున్న వరి నాళ్లు

గొల్లపల్లి : గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వర్షాకాలం వరి సాగు మొదలైనా ఇప్పటివరకు మండలంలో సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నా వరి నారు ముదురుతుండడంతో నాట్లు వేయకతప్పడం లేదు. మండలంలోని రాపల్లె, ఇబ్రాజ్ పల్లె, గుంజపడుగు తదితర గ్రామాల్లో పలువురు రైతులు వరి నారు ముదురుతున్న దృష్ట్యా నాట్లు వేయడం ప్రారంభించారు. మండలంలో ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటివరకు అప్పుడప్పుడు ఓ మోస్తరు వర్షం కురుస్తున్నప్పటికి భారీ వర్షం కురవడం లేదు. దీంతో వ్యవసాయ బావుల్లో, చెరువుల్లో, కుంటల్లో నీటి మట్టం పూర్తిగా అడుగంటి నీటి ఎద్దడితో వెలవెలబోతున్నాయి. మండలంలో ఇప్పటివరకు సాధారణ వర్షం కూడా కురవలేదని, అయినప్పటికీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రుతుపవనాలు వేగంగా ముందుకు వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. మండలంలో గత వర్షాకాలంలో 22వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా ఈ యేడు సైతం అంతే మోతాదులో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మండలంలో అధికరంగా వ్యవసాయ బావుల మీదే ఆధార పడి వరి పంటను సాగు చేస్తుండగా, చెరువులు, కుంటలను నమ్ముకుని కొన్ని గ్రామాల్లో పంటలను సాగు చేస్తున్నారు. ఎస్సారెస్పీ సాగు నీటి మీద ఆధారపడి పంటలను సాగు చేస్తున్న రైతులు సైతం కొంత మేర ఉన్నప్పటికి అత్యధికంగా వ్యవసాయ బావుల మీదే ఆధారపడి పంటలను సాగు చేస్తున్న రైతులే అధికంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



ఎండిపోయిన పొలం మడి

● సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

వర్ధినేని లింగారావు, రైతు, కథలాపూర్

వరద కాలువను నమ్ముకుని ఐదెకరాలు సాగు చేసుకుంటాను. అయితే ఇప్పటికీ వరద కాలువలోకి నీరు రాకపోవడంతో నారు పోసుకోలేను. సీజన్ దాటి పోతున్నందు వల్ల పంటలు సాగు చేసే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం నారు పోసుకోడానికి కూడా వరద కాలువలో నీరు లేదు. వరుణ దేవుడు కరుణించక కాలం కలిసి రావడం లేదు. ఆలస్యంగా నాట్లు వేస్తే వాతావరణం సహకరించక దిగుబడులు రావు.

పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయించాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి, జూలై 11: ధర్మపురి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు చేపట్టిన పనులు, పెండింగ్ పనులు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పన్నులు వసూలు గురించి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 100 శాతం వసూలు చేసి ఆదాయం పెంచాలన్నారు. పట్టణంలో పారిశుధ్య పనులు వేగవంతం చేయించాలని, డ్రైనేజీ వ్యవస్థ బాగు పరచాలని, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకవాలన్నారు. విద్యుత్ లోవోల్టేజీ లేకుండా చూడాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతు చేయించి, లూజ్ పోల్స్, వైర్లు సరిగా చేయాలన్నారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. పంచాయితీరాజ్, ఎండోమెంట్ పెండింగ్ పనులను కూడ త్వరగా పూర్తి చేయించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ప్రజల అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రజలకు ఆటంకంగా ఉన్న పైలాన్ విషయమై మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే సమావేశం వరకు ప్రతి అధికారి చేపట్టిన పనులు, పెండింగ్, సమస్యలతో కూడిన నివేదికతో రావాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అధికారుల అందరు అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ విప్ కలిసి మొక్కలు నాటారు. జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈలు శేఖర్‌రెడ్డి, సతీష్, ఎండోమెంట్ ఈఈ రాజేష్, డీడబ్ల్యువో శ్రీవాణి, డీఈఈలు రాజరెడ్డి, లక్ష్మణ్‌రావు, మురళి, రోహిత్‌రెడ్డి, రఘునందన్, నియోజవర్గ స్థాయి ఏఈఈలు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య

ఎండపల్లి, జూలై 11: మండలంలోని కొత్తపేటలో భార్య కాపురానికి రావడంలేదని ఓ యువకుడు మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నా డు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన బొద్దుల నాగరాజు(37)కు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రంగంపల్లికి చెందిన మంజులతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రెండు రోజుల క్రితం భార్య మంజుల నాగరాజుతో గొడవ పెట్టుకొని పు ట్టింటికి వెళ్లడంతో మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి

పెగడపల్లి, జులై 11 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో ప్రతి పౌరుడు భాగస్వాములవ్వాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండలంలోని పెగడపల్లి, కీచులాటపల్లి తదితర గ్రామాలలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కీచులాటపల్లిలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వన మహోత్సవం ప్రభుత్వ కార్యక్రమంగా బావించకుండా ప్రతి ఒక్కరు తమ కార్యక్రమంగా బావించి మొక్కలు నాటి సంరక్షించినపుడే కార్యక్రమం విజయవం తమవుతుందన్నారు.

'శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగించాలి'

మెట్‌పల్లి రూరల్, జూలై, 11 : గ్రామాల్లో చేపట్టిన శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగించాలని మెట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆత్మనగర్ గ్రామాల్లోని చేపట్టిన శానిటేషన్ పనులు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలు, స్వశక్తి మహిళ కుట్టు కేంద్రం, పంచాయతీ కార్యాలయం, రికార్డులు, మురికి కాలువలను శుభ్రం చేస్తున్న పనులు పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారపోయించి, పరిసారాలు శుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామసభలో ఇంటితో పాటు పరిసారాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామంలో నిర్వహింస్తున్న శానిటేషన్ పనులకు పంచాయతీ కార్యదర్శి నిజాముద్దిన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తప్పకుండా డ్రై డే కార్యక్రమాలను తప్పకుండా చేపట్టాలన్నారు. ప్రజలు చెత్తను మురికి కాలువలు, రోడ్లపై వెయ్యకుండా ఇంటి ముందుకు వచ్చే పంచాయతీ వాహనాలకు అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నిజాముద్దిన్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



ఊరేగింపులో పాల్గొన్న చైర్ పర్సన్, మాజీ జడ్పీ చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, జూలై 11 :జగిత్యాల జిల్లా కేంద్రంలోని 15, 16 వార్డుల్లోని భక్తుల ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ తల్లికి బోనాల పండుగ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత వేడుకల్లో పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలియజే శారు. అనంతరం డీజే పాటలు, కోలాటాల మధ్య పోచమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట మల్లిఖార్జున్, కూతురు రాజేష్, కూతురు పద్మ ఉన్నారు.

ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



మల్యాలలో కేకు కట్ చేస్తున్న బీజేపీ నాయకులు



బండి సంజయ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

మల్యాల, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను మల్యాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగడిబజారులో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో సంజయ్ పేరటి ప్రత్యేక పూజలు జరిపారు. బింగి వేణు, గాజుల మల్లేశం, యాగండ్ల లక్ష్మీనారాయణ, మల్లేశం యాదవ్, బొడిగే సురేష్, సామ మహిపాల్‌రెడ్డి, పిల్లి రాజశేఖర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మహేష్, రవి, రాజు, వేణు, గంగస్వామి, రాములు, గవాస్కర్ పాల్గొన్నారు

కథలాపూర్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. అనంతరం క్రీడా ప్రాంగణం వద్ద మొక్కలు నాటారు. సిరికొండ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, మారుతి, ప్రతాప్, అజయ్, సునిల్, రాజశేఖర్, బద్రి సత్యం, గాండ్ల స్వామి ఉన్నారు.

కోరుట్ల రూరల్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సమీపంలోని దర్గా దేవి దేవాలయం వద్ద గురువారం బీజేపీ కౌన్సిలర్ పెండం గణేష్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. దుర్గా దేవి దేవాలయంలో బండి సంజయ్ పేరిటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బీజేపీ, బీజే వైఎం నాయకులు శ్రీనివాస్, అశోక్, గంగాధర్, సాయిచంద్, సంజయ్, సాగర్, నవీన్, నవీన్, సంతోష్, గుండెటి సాయి కుమార్, రుద్ర విఘ్నేష్, చిట్యాల రవికుమార్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం మండల బీజేపీ నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు రాజేశం, రాకేష్, భూమేష్, చిరంజీవి, అశోక్, భాస్కర్‌రెడ్డి, నరేష్, శ్రీధర్, దేవయ్య, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోరుట్ల : పట్టణ సెల్ పాయింట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడుగా బోగ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎంఏ అఫ్జల్, ప్రదాన కార్యదర్శిగా గాజుల మధు, కోశాధికారిగా అడ్లగట్ట సురేష్, సహాయ కార్యదర్శిగా ఎండీ అక్బర్ హుసెన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

●రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాడెంట్ తుమ్మనపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటి వాటి పరిరక్షణకు ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ సిరికొండ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలపతిరెడ్డితో కలిసి కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కృష్ణరావు మొక్కలను నాటారు. అనంతరం కృష్ణరావును నాయకులు సన్మానించారు.

బీర్‌పూర్: మండలంలోని రోళ్లవాగు ఆధునికీకరణ పనులను త్వరగా పూర్తి చేయించాలని ఈఎన్‌సీ అనీల్, ఆపరేషన్ ఆండ్ మెయింటనెన్స్ నాగేంద్రలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశించారు.

రాయికల్: డీఎస్సీ అభ్యర్థులపై, పాత్రికేయులపై జరిగిన దాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. టీఆర్ఎస్ నాయకులకు, పాత్రికేయులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, తురగ శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, కన్నాక మహేందర్, కో ఆప్షన్ సభ్యుడు సోహైల్, నాయికులు అనిల్ కుమార్, సత్యనారాయణ, గణేష్, లింగం గౌడ్, వినోద్, బాబా, లక్ష్మణ్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్ దొంగలమర్రి బస్ స్టేజీల మధ్య బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో మృతి చెందిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామానికి చెందిన తంబల అంజయ్య(31)గా గుర్తించినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు.

●మండల కేంద్రానికి చెందిన ఆరె అంజయ్య కుటుంబానికి, ఈగ రజిత ఉపాధి కోసం టీఎల్ యువసేన ఫౌండర్, సామాజిక వేత్త తూడి లచ్చన్న గురువారం 10 వేల రూపాయల చొప్పున నగదును అందించారు. నల్లగొండ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దండు శేఖర్ గుండె పోటుతో మరణించగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలను అందించారు. నాయకులు రాజశేఖర్, రాకేష్, పోషాలు, శోభన్, తిరుపతి, పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేటకు చెందిన అంబల్ల అర్చన చార్టెడ్ అకౌంట్ (సీఏ)లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచింది. ఐసీఏఐ ఇండియా ఇన్స్టిట్యూట్ ద్వారా చార్టెడ్ అకౌంట్ పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. అర్చనను గ్రామస్తులు అభినందించారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ మెట్‌పల్లి వారు చేయూతను అందించారు. ట్రస్ట్ సభ్యుడు అరె రాజు పుట్టిన రోజు పురస్కరించుకుని విద్యార్థులకు నోటు బుక్స్, షార్ట్ నోటు బుక్స్, పెన్నులు, స్టేషనరీస్ అందించారు.

సీజనల్ వ్యాధుల పై అవగాహన

జగిత్యాలరూరల్, జూలై 11 : జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామంలో గురువారం కళా బృందంవారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వర్షకాలంలో వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో పంచాయితీకార్యదర్శి కొమురయ్య, కారోబార్ శేర్ల రమేష్, ఏఎన్ఎం లావణ్య, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పుట్టరమేష్, నలువాల గంగారాజం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, జూలై 11 : జగిత్యాల రూరల్ మండలంలోని గొల్లపల్లె ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తీసివేయుటకోసం లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్నారం, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు.

మల్లాపూర్ : మండల కేంద్రంతో పాటు వివిరా వుపేట, ధాంరాజుపల్లి, మొగిలిపేట, రాఘవపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా ఉండదని గురువారం విద్యుత్ అధికారులు ప్రకటన ద్వారా తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గ్రామాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యహ్నాం 1.30 వరకు మళ్లీ సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిలిపివేసి మరమ్మతులను చేపట్టనున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.